# "నాదనామక్రియ"

చందూరి లక్ష్మినారాయణ

అవి మాకు వేసంగి శలవలు. శలవలలో ఒక సారి మద్రాసు చిన్న టూర్ వేశా. నేను మద్రాసు వెళ్ళడం అదే మొదటిసారి. ఒకరోజు సాయంత్రం పార్కుకు వెళ్ళా. నేను వెళ్ళేటప్పటికి అక్కడవున్న కుర్చీలు, బల్లలనిండ జనం ఉన్నారు. నాకు కూర్చుందుకు ఎక్కడా ఖాళీ దొరకలేదు. కాని, చటుక్కున ఒకబల్లమీద దృష్టి ఆనింది. ఆబల్ల చివర 15, 16 ఏండ్ల వయస్సుగల ఒక అమ్మాయి మాత్రం కూర్చొని వుంది ఖాళీ దొరికిందికదా! అని సంతోషంతో రెండవ చివర నేనూ కూర్చొన్నాను. నేనూ కూర్చొన్నానో, లేదో, వెంటనే ఆఅమ్మాయి లేచి నుంచుంది. పాపం! నాకేసి అదోక రకంగా జాలిగా చూచి తానే యింకొకచోటు చూచుకొంది. ఈవిషయం ఎవరైనా చూచారేమో అని సిగ్గుపడ్డా. కాని, ఎవరిగొడవ వారిది. ఎవరూ యీవిషయం గమనించలేదుకదా అని సంతోషించా. చాలాసేపు గడచింది. రకరకాల గాయకుల పాటలు వింటూంటే మనసులో విచారానికి తావులేక హాయిగావుంది. చాలామంది చాలామంది ఎవరి యిష్టాగోష్టి వాళ్ళుమాట్లాడు కొంటున్నారు. ఇంతట్లో క్రమేణా చీకటి అల్లుకువస్తోంది. అప్పుడే 7½ గం॥ అయింది. పాటలు అయింది. పాటలు కూడా అయిపోయాయి. ఏదో న్యూస్‌మాత్రం వినిపిస్తోంది. ఇంక యింటి ముఖం పడదామని లేచా. నేనూ లేచిన వెంటనే యిందాకటి అమ్మాయి జ్ఞాపకంలేదూ! ఆ అమ్మాయికూడా లేచింది. నాకన్న ముందుగా చరచరా రోడ్డుమీదకు వచ్చింది. ఎవరికోసమో గాని అక్కడే నుంచుని చూస్తోంది. ఇంతట్లో నేనూ రోడ్డుమీదకు వచ్చా. నేను కనిపించగానే నడక సాగించింది. వెంటనే నాకు అనుమానం వేసింది నన్ను ప్రేమించిందేమోనని. మధ్యమధ్య నేను వస్తున్నానో లేదో అని వెనక్కి తిరిగి చూస్తోంది. నేను ఆగిపోతే తనూ ఆగిపోయేది. నేను బయలుదేరితే తనూ బయలుదేరేది. ఈ విషయాలన్నీ నా అనుమానానికి యింకా దోహదమిస్తున్నాయ్. "నన్ను నిజంగా ప్రేమిస్తే పార్కులోనే ఎందుకు చెప్పకూడదూ! అంత సిగ్గు ఎందుకూ! నేను బల్లమీద కూర్చుంటే బల్లమీదనుంచి లేచిపోయిందే! ప్రేమించడము లేదేమో!" "అబ్బే, అదేమీకాదు. స్త్రీ సహజంగా అబల, సిగ్గు ఎక్కువ. నాతో తన ప్రేమను తెల్పడానికి సిగ్గుపడివుంటుంది. ఇప్పుడు నన్ను వాళ్ళ తలిదండ్రులకు చూపించి, పెళ్ళికి ఒప్పిస్తుందేమో!" "ఆ! ఇది నిజం. ఆ అమ్మాయి అభిప్రాయం తెలిసింది" అంటూ అనేక ఊహాలు నాబుర్రలో బయలుదేరాయ్. "ఎప్పుడు ఆ అమ్మాయి యిల్లు వస్తుందా! ఎప్పుడు ఆ అమ్మాయి తలిదండ్రులతో చెప్పి పెండ్లికి ఒప్పిస్తుందా! ఆ అమ్మాయి అధరామృత మెప్పుడు గ్రోలుతానా!" అంటూ నా మనస్సు తొందర పడుతోంది. చాలాదూరం వెళ్ళగా ఆ అమ్మాయి ఒక యింట్లోకి వెళ్ళింది.

ఆయిల్లే ఆ అమ్మాయి యిల్లు అయివుంటుందని, నన్ను ఆహ్వానించడానికి మళ్ళీ వస్తుందిగదా! అని గుమ్మంలోనే నుంచున్నా. కాని లోపలనుంచి మాత్రం ఈక్రింది మాటలు వినవచ్చాయి.

"ఏమే అమ్మాయీ! ఇంత చీకటిపడేదాకా రాలేదు. అసలు నీకు చీకట్లో వెళ్ళడం అంటే మంటే భయం ఎలా వచ్చావ్?"

"మన వీధిలోవున్న సుబ్బరాయశాస్త్రిగారి యింటికి వారంరోజుల క్రితం ఒక అబ్బాయి రాలేదూ! ఆ అబ్బాయి పార్కునుంచి వెనకాల వస్తుంటే నేను గబగబా ముందు వచ్చాను. ఈ వేళ చీకటిపడినందుకు, పాపం! ఆ అబ్బాయి సాయం ఉండటంచేత భయంలేకుండా రాగలిగాను."

ఈ మాటలు వినేప్పటికి నాగుండెల్లో రాయి పడింది. తారుమారైంది. ఇంకా గుమ్మంలో నుంచుంటే బాగుండదని "తానొకటి తలచినా తలచు దైవము వేరొకటి" అని నాదనామక్రియ రాగంతో పాడుతూ వెంటనే యింటివైపు కాళ్ళీడ్చుకుంటూ నడిచా.

మరునాడే మద్రాస్‌కు గుడ్‌బై కొట్టి స్వగ్రామం చేరుకున్నా.

టెలిఫోన్ : 2802 గ్రామ్స్ : "వుమ్మిడియార్"

వుమ్మిడి రామయ్యచెట్టి, గురుస్వామిచెట్టి అండ్ కో.

వజ్రాలలో, బంగారు నగలలో, వెండి సామగ్రిలో ప్రఖ్యాతిచెందిన వ్యాపారస్థులు




వర్కు-షాపు : 62, గోవిందప్ప నాయక్ వీధి, మద్రాసు.

ఆఫీసు, అండ్ ప్రదర్శనశాల : 24 & 25, చైనాబజారు రోడ్డు, మద్రాసు.